క్లుప్తంగా

వైభవంగా పంచమ జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఊరేగింపు నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: మండలంలోని ఆమిద్యాల గ్రామంలో ఐదేళ్లకు ఒకసారి నిర్వహించే చౌడేశ్వరీ అమ్మవారి పంచమ జ్యోతుల మహోత్సవం ఆదివారం వైభవంగా సాగింది. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు అభిషేకం, కుంకుమార్చన, మహామంగళహారతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం తొగట వీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో పంచమజ్యోతుల మహోత్సవం చేపట్టారు. భక్తులు ఐదు జ్యోతులను తలమీద పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేర్చారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. జ్యోతుల ఉత్సవానికి నియోజకవర్గ వ్యాప్తంగా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

రైతులను ఆదుకోవాలి

కూడేరు: వర్షాభావంతో ఈ ఏడాది ఖరీఫ్‌లో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ఓబులేసు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య విజ్ఞప్తి చేశారు. ఆదివారం వారు కూడేరులో వేరుశనగ, కంది, ఆముదం, అరటి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. సకాలంలో వర్షాలు కురవక పోవడంతో పంటలు దెబ్బతిన్నాయన్నారు.పెట్టుబడులు కూడా రైతులకు దక్కే పరిస్థితి లేదన్నారు. ప్రభుత్వం వేరుశనగ రైతులకు ఎకరాకు రూ.30 వేలు పరిహారం అందించి ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్, తాలుకా కార్యదర్శి మల్లికార్జున, సహాయ కార్యదర్శి మనోహర్, మండల కార్యదర్శి నారాయణమ్మ, మండల నేతలు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యం



పోస్టర్లు విడుదల చేస్తున్న జేవీవీ నాయకులు

ఉరవకొండ: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించడమే లక్ష్యమని జనవిజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.దివాకర్, నిస్వార్థ ఫౌండేషన్ అధ్యక్షుడు వెంకట్ తెలిపారు. ఆదివారం స్థానిక ఎస్కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో 2023 చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు రాష్ట్ర స్థాయి పోటీల పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా జేవీవీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ పాఠశాల స్థాయిలో ఈ నెల 10 నుంచి 30వ తేదీ వరకూ, జిల్లా స్థాయిలో డిసెంబర్ 17 నుంచి 2024 జనవరి 27 వరకూ జరుగుతాయన్నారు. కార్యక్రమంలో జేవీవీ నాయకులు లక్ష్మీనారాయణ, భాస్కర్, అమరేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



ప్రమాదస్థలిలో గుమిగూడిన జనం

రాయదుర్గం: రాయదుర్గం నుంచి బళ్లారి వైపు ప్రయాణికులతో వెళుతున్న ఆర్టీసీ బస్సును డి హీరేహాళ్ మండలం పులకుర్తి గేట్ వద్ద ఓవర్ టేక్ చేయబోయిన టిప్పర్ వెనుక నుంచి ఢీ కొట్టింది. ఘటనలో బస్సు అద్దాలు ధ్వంసం కాగా, 30 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. డ్రైవర్ స్వల్పంగా గాయపడడంతో బళ్లారి ఆస్పత్రికి తరలించారు. టిప్పర్ ముందుభాగాన దెబ్బతింది. త్రుటిలో ఘోర ప్రమాదం తప్పిందని ప్రయాణికులంతా ఊపిరి పీల్చుకున్నారు. కంకరలోడుతో వెళ్లే టిప్పర్ల వేగానికి తరచూ ఇలాంటి ప్రమాదాలు సంభవిస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

ఆలయ నిర్మాణానికి నిధుల మంజూరు



లక్ష్మీ నరసింహస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేసి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

కుందుర్పి: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో లక్ష్మీ నరసింహస్వామి దేవాలయ నిర్మాణానికి రూ.10 లక్షల నిధులు మంజూరైనట్లు ఎంపీపీ కమలమ్మ తెలిపారు. దేవదాయశాఖ, టీడీపీ సంయుక్తంగా నిధులు మంజూరు చేసిందన్నారు. అనంతరం ఆమె జెడ్పీ మాజీ సభ్యుడు రాజగోపాల్, నాగరాజు తదితరులతో కలసి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామస్తులు నిజవల్లి బాబు, నాగప్ప, ఆనందముని, ఓబయ్య, హనుమంత రాయుడు, టైలర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే గ్రామాభివృద్ధి



గరుడాపురంలో నిర్మించిన గ్రామ సచివాలయం



రైతు భరోసా కేంద్రం



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం

- టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడదూరంలో గరుడాపురం
- సొంత పంచాయతీని పట్టించుకోని అప్పటి టీడీపీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి
- వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామానికి మహర్దశ



నా పేరు కె.దుర్గమ్మ. మాది కళ్యాణదుర్గం మండలం గరుడాపురం గ్రామం. వైఎస్సార్‌సీపీ అధికారం వచ్చాక నాకు ఏడాదికి రూ.45 వేలు ఆర్థిక సాయం అందుతోంది. టీడీపీ ప్రభుత్వమున్నప్పుడు ఇలాంటి పథకాలు ఏవీ లేవు. కూలీ పనులు చేసుకుని బతికేవాళ్లం. ఇప్పుడు సంతోషంగా ఉంటున్నాం.



నా పేరు మమత. నాది గరుడాపురం. నా భర్త తిప్పేస్వామి రెండేళ్ల క్రితం అనారోగ్యంతో చనిపోయాడు. గ్రామ వలంటీర్ మా ఇంటికి వచ్చి నెలలోపే వితంతు పింఛను ఇచ్చాడు. ఇప్పుడు నెల నెలా పింఛనుతో గర్వంగా బతుకుతున్నాను.ఏది కావాలన్నా సచివాలయంలోనే అందుతున్నాయి. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

కళ్యాణదుర్గం: నియోజకవర్గం కేంద్రం నుంచి నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న గరుడాపురం పంచాయతీ టీడీపీ హయాంలో అభివృద్ధికి ఆమడ దూరంగా ఉండేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆ గ్రామ రూపు రేఖలు మారాయి. గత 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి ఎమ్మెల్యేగా ఇదే పంచాయతీలోని యర్రంపల్లికి చెందిన ఉన్నం హనుమంతరాయ చౌదరి గెలుపొందారు. అయితే ఆయన సొంత పంచాయతీని కూడా పట్టించుకోలేదు. అభివృద్ధి ఊసే లేదు. పంచాయతీ కార్యాలయం సైతం పాడుబడి శిథిలావస్థకు చేరుకున్న గదుల్లోనే విధులు నిర్వహించే దుర్భర పరిస్థితి. ఇక సంక్షేమ పథకాల మాటే ప్రజలకు దరిచేరేవి కావు. కేవలం జన్మభూమి కమిటీలో కొందరికి మాత్రమే పింఛను, అరకొర పథకాలందేవి.

వైఎస్సార్‌సీపీ పాలనలో మహర్దశ

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఆ గ్రామ పంచాయతీ మహర్దశ కలిగింది. గ్రామ సచివాలయాల నిర్మాణంతో పాలన నిష్పక్షపాతంగా సాగుతోంది. అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయి. సొంత భవనాలతో సొబుగులు నింపుకుని గ్రామానికే ఆదర్శంగా నిలుస్తున్నాయి భవనాలు. ఉన్న ఊర్లోనే సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్ల నిర్మాణాలతో ప్రజలకు ఇబ్బందులు తప్పాయి. రైతులకు వ్యవసాయ విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు సైతం ఊర్లోనే అందుబాటులో ఉంటున్నాయి. డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటికో వైద్యుడు వచ్చి వైద్యం చేస్తున్నాడు.

పంచాయతీలో అభివృద్ధి పనులు ఇలా..

- కుర్లపల్లి గ్రామంలో రూ.15 లక్షలతో 230 మీటర్ల సీసీ రోడ్డు నిర్మాణం
- గరుడాపురంలో రూ.7 లక్షలతో అంగన్‌వాడీ భవన నిర్మాణం
- నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా 40 మందికి ఇంటి పట్టాల పంపిణీ
- రూ.43 లక్షల వ్యయంతో సచివాలయ భవనం, రూ.23 లక్షలతో ఆర్‌బీకే, రూ.22 లక్షలతో హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించారు.

పంచాయతీ: గరుడాపురం	
పంచాయతీ పరిధిలో గ్రామాలు: ఉప్పొంక, కుర్లపల్లి, యర్రంపల్లి, గరుడాపురం.	
మొత్తం ఇళ్లు:	1,456
మొత్తం జనాభా:	4,538
సంక్షేమ పథకాలు అందుతున్న ఇళ్లు:	1,378
వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక అందుతున్న పింఛన్లు:	540
గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్లు:	211
2019 నుంచి 2022 మే వరకూ పంచాయితీలో వివిధ పథకాలకు ఖర్చు చేసిన నిధులు:	రూ.11,23,78,955

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన



గొల్లపల్లిలో సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

గుమ్మఘట్ట: సంక్షేమ పాలన అందజేస్తూ, 98 శాతం హామీలను నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ముగింపు కార్యక్రమం మండలంలోని గొల్లపల్లిలో సర్పంచ్ అనంతమ్మ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విప్ హాజరై ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎంపీటీసీ నాగలక్ష్మి, మండల కన్వీనర్ గౌని కాంతారెడ్డితో కలిసి అందించారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. కులమతాలు, పార్టీలు, రాజకీయాలకతీతంగా సంక్షేమ పథకాలు ఇంటివద్దకే అందిస్తున్నామన్నారు. రాబోవు ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆదరించాలని కోరారు. టీడీపీని నమ్మితే నట్టేట మునగడం ఖాయమన్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అనేక స్కాంలు జరిగాయన్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన టీడీపీ నాయకులు అడ్డదారుల్లో వారి జేబులు నింపుకున్నారని విమర్శించారు. టీడీపీ అంటే తిని దాచుకునే పార్టీ అని ఎద్దేవా చేశారు. చంద్రబాబుకు వయస్సు మీరడంతో మతిభ్రమించిదన్నారు. త్వరలోనే చంద్రబాబు జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతుంటే ఎల్లో మీడియా మాత్రం నిత్యం విష పురాతలు రాస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని ఫైర్ అయ్యారు. ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రాబోవు ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ప్రభంజనాన్ని ఎవరూ ఆపలేరన్నారు. ప్రజలంతా వైఎస్సార్సీపీకి మద్దతుగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఎన్టీ సిద్దప్ప, జిల్లా ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, కాంట్రాక్టర్ ఆర్టీ కాంతారెడ్డి, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, అగ్రిబోర్డు కమిటీ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, సర్పంచులు ఉమేష్, రమేష్, మాజీ సర్పంచ్ విజయేంద్ర, పీఏసీఎస్ అధ్యక్షుడు గెజ్జిని రామప్ప, మాజీ అధ్యక్షుడు జరుకుల గురువయ్య, నాయకులు బంగారు అంజినేయులు, నల్లక్కి తిప్పేరుద్ర, నల్లక్కి పురుషోత్తం, తిమ్మారెడ్డి, గోనబావి ప్రతాప్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ బాగన్న, తిమ్మారెడ్డి, సిద్దప్ప, పైదొడ్డి ఈరన్న, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితాయే లక్ష్యం



రాయదుర్గం: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ ఓబులేసు, ఈడీటీ సుజాత



కంబదూరు మండలం ములకనూరులో స్పెషల్ క్యాంపెయిన్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ రాణి సుస్మిత



కూడేరు: దరఖాస్తుల వివరాలను తెలుసుకుంటున్న తహసీల్దార్ శేషారెడ్డి

రాయదుర్గం: తప్పుల్లేని ఓటరు జాబితా తయారు చేయాలన్నదే ఎన్నికల కమిషన్ లక్ష్యమని, అందులో భాగంగానే శని, ఆదివారం రెండు రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించామని రాయదుర్గం మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఓబులేసు అన్నారు. పట్టణంలోని ఆదివారం వారు విడివిడిగా పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను ఈడీటీ సుజాతతో కలసి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్పెషల్ క్యాంపులను ఓటర్లు సద్వినియోగం చేసుకున్నారన్నారు. రాయదుర్గం నియోజకవర్గంలోని అర్బన్‌తో పాటు ఐదు మండలాల్లోనూ 296 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటిలో రెండు రోజుల పాటు చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో చేర్పుల కోసం 486 దరఖాస్తులు వచ్చాయన్నారు. అలాగే మార్పులు, తొలగింపులు, తప్పులు సరిదిద్దేందుకు 778 దరఖాస్తులు వచ్చాయయన్నారు.

పకడ్బందీగా నిర్వహించాలి: ఆర్డీఓ

కంబదూరు: ఓటరు స్పెషల్ క్యాంపెయిన్‌ను పకడ్బందీగా నిర్వహించాలని ఆర్డీఓ రాణి సుస్మిత ఆదేశించారు. ఆదివారం మండలంలోని ములకనూరు, గుద్దెళ్ల, మర్రిమాకులపల్లిలోని 210, 211, 212వ పోలింగ్ కేంద్రాలను ఆర్డీఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ నయాజ్ అహ్మద్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని 180,181,182,183 పోలింగ్ స్టేషన్లలో జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని ఆదివారం కళ్యాణదుర్గం ఆర్డీఓ రాణి సుస్మిత పరిశీలించారు. కార్యక్రమంలో విజయకుమారి, డీటీ తిప్పేస్వామి, వీఆర్‌ఓ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలంలోని లక్ష్మంపల్లిలో 156, 157 పోలింగ్ బూత్‌లను ఆర్డీఓ రాణి సుస్మిత ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ మహేశ్వరరెడ్డి , రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండలంలోని బ్రహ్మసముద్రం, భైరసముద్రం వేపులపర్తి , భైరవానితిప్ప తదితర గ్రామాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని డిప్యూటీ తహసీల్దార్ శ్రీనాథ్ రెడ్డి, ఆర్ఐ నాగిరెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వీఆర్ఎలు వేణుస్వామి , నాగరాజు, మల్లికార్జున , బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కూడేరు: మండలంలో నిర్వహించిన ఓటర్ నమోదు స్పెషల్ డ్రైవ్ కార్యక్రమానికి ప్రజల నుంచి స్పందన వచ్చిందని తహసీల్దార్ శేషారెడ్డి తెలిపారు. ఆదివారం స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం మండలంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో జరిగింది. తహసీల్దార్ ఓటర్ నమోదును పర్యవేక్షించారు. మొత్తం 52 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీటీ విశ్వనాథ్, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని పందికుంట, రాగులపాడు, కొనకొండ్ల తదితర గ్రామాల్లో ఆదివరాం జరుగుతున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ అనిల్‌కుమార్ పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్‌ఓలు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న సీసీ రోడ్ల నిర్మాణం



పీసీ ప్యాపిలి తండాలో సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభమైన దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ఊపందుకుంది. స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పర్యవేక్షిస్తూ పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం మండలంలోని పీసీ ప్యాపిలి పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. పనులను సర్పంచు జ్యోతిభాయి, వైస్ ఎంపీపీ సుంక మ్మ, ఎంఎల్‌ఓ తేజేశ్వరరెడ్డి, యువజన విభాగం ఉపాధ్యక్షుడు వీరాంజి, ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు ప్యాపిలి కిష్టప్ప, ఎస్సీ సెల్ కార్యదర్శి భీమా తదితరులు పర్యవేక్షించారు. వారు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి కృషితోనే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు నిధులు మంజూరయ్యాయన్నారు. కాగా పీసీ ప్యాపిలిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభవడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

9 నుంచి 'ఏపీకి జగనన్న ఎందుకు కావాలి'

కూడేరు: మండలంలో 'ఏపీకి జగనన్న ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని ఈ నెల 9 నుంచి 24 వరకు అన్ని సచివాలయాల్లో నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి ఆదివారం తెలిపారు. కార్యక్రమానికి సంబంధించి సచివాలయ ఇన్‌చార్జులు, షెడ్యూల్ వివరాలను ఆయన వెల్లడించారు. 9న చోళసముద్రం సచివాలయంలో (వడ్డే గంగాధర్, సేజాల దేవేంద్ర) , 10న కూడేరు–1 (నిర్మలమ్మ), 14న కూడేరు–2(బైరెడ్డి రామచంద్రారెడ్డి), 15న గొటుకూరు (ఎంపీపీ నారాయణరెడ్డి) 16న ఉదిరిపికొండలో(దేవాంజనేయులు), 17న పి.నారాయణపురం(బైరెడ్డి రామచంద్రారెడ్డి)లో కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే 20న ఇప్పేరు (ఎంపీపీ నారాయణరెడ్డి, సుబ్బమ్మ), 21న కమ్మూరులో(దేవేంద్ర), 22న కొర్రకోడులో(కుమ్మర రామ్మోహన్), 23న తిమ్మాపురంలో(బైరెడ్డి రామచంద్రారెడ్డి),24న మరుట్ల–2వ కాలనీలో (తుప్పటి హరీష్, కోమలి భాస్కర్ రెడ్డి) కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీ, ఎంపీపీ, పార్టీ నేతలు, అనుబంధ సంఘాల నేతలు, గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు హాజరై విజయవంతం చేయాలన్నారు.

మానవత్వం చాటుకున్న ఆపద్బాంధవ ట్రస్టు



అనాథ మృతదేహాన్ని మోసుకెళ్తున్న ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులు

ఉరవకొండ: స్థానిక బైపాస్ వద్ద ఉన్న రాములమ్మ ఆలయం పరిసరాల్లో కొన్ని సంవత్సరాలుగా మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న 54 ఏళ్ల వ్యక్తి శనివారం మృతి చెందాడు. ఆపద్బాంధవ ట్రస్టు వ్యవస్థాపకుడు మురళి, సభ్యులు అనాథ మృతదేహానికి మేజర్ పంచాయతీ పారిశుద్ధ్య సిబ్బంది సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు. ఇందుకు పంచాయతీ ఈఓ గౌస్‌సాహెబ్, అర్బన్ సీఐ తిమ్మయ్య, ఎస్ఐ వెంకటస్వామి అనుమతి తీసుకున్నారు. ఆపద్బాంధవ ట్రస్టు సభ్యులను అధికారులు అభినందించారు.

వలంటీర్ ఔదార్యం



ఆస్పత్రిలో పెన్షన్ అందజేస్తున్న వలంటీర్ పవిత్ర

రాయదుర్గం: పట్టణంలోని 5వ సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న వలంటీర్ కే రూపావతి ఔదార్యం చాటుకున్నారు. తన క్లస్టర్ పరిధిలోని సిడిగొండే మల్లికార్జున షుగర్ వ్యాధితో బళ్లారిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతడికి కాలు తొలగించడంతో నడవలేని స్థితికి చేరాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ ఆదివారం సొంత ఖర్చులతో బళ్లారికి వెళ్లి పెన్షన్ సొమ్ము అందించారు. ఈ సందర్భంగా వలంటీర్ వ్యవస్థను అమల్లోకి తీసుకొచ్చిన సీఎం జగన్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

విద్యాసంస్థల బంద్ జయప్రదం చేయండి

రాయదుర్గంటౌన్: విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 8న చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి సంఘా నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐవైఎఫ్ నాయకులు బంద్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంజనేయులు, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రసాద్, ఏఐవైఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు కుమార్‌నాయక్ మాట్లాడారు. కడప ఉక్కు పరిశ్రమను ప్రారంభించాలని, విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ ఆపాలని ముఖ్య డిమాండ్‌లతో విద్యాసంస్థల బంద్ చేపడుతున్నామన్నారు.

రక్తదాన శిబిరానికి స్పందన

వజ్రకరూరు: మండలంలోని చాబాల ఆర్డీటీ పాఠశాలలో గ్రామ యువత ఆధ్వర్యంలో అనంత రెడ్ డ్రాప్స్ చారిటబుల్ ట్రస్టు సహకారం, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ప్రజల నుంచి మంచి స్పందన లభించింది. సర్పంచు మల్లెల జగదీష్ శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సర్దార్‌వలి, దాదు,మూర్తి, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతల కోసమే కార్డెన్ సెర్చ్



కురువళ్లిలో కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్న సీఐ యుగంధర్

బొమ్మనహాళ్: శాంతిభద్రతల పరిరక్షణకోసమే కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు రాయదుర్గం రూరల్ సీఐ యుగంధర్ అన్నారు. మండలంలోని కురువళ్లిలో ఆదివారం ఉదయం అనుమానితుల ఇళ్లలో పోలీసులు తనిఖీలు నిర్వహించి శాంతిభద్రత పరిరక్షణకు పలు సూచనలు చేశారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో శాంతిభద్రతల కోసం కార్డన్ సెర్చ్ నిర్వహించామన్నారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు కనిపిస్తే ప్రజలు పోలీసులకు సమాచారమివ్వాలని సూచించారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడకుండా, శాంతియుతంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో బొమ్మనహాళ్, కణేకల్లు ఎస్ఐలు శివ, దుగ్గిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



పైప్‌లైన్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న యువనేత ప్రణయ్‌రెడ్డి

ఉరవకొండ: పట్టణంలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడిని పరిష్కరించడమే ధ్యేయంగా జేజేఎం పనులు చేపడుతున్నామని పార్టీ యువజన విభాగం జోనల్ చైర్మన్ వై.ప్రణయ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక చెంగలవీధిలోని పోతప్పకట్ట నుంచి గుర్రం వెంకన్న వీధి వరకూ రూ.10 లక్షల వ్యయంతో చేపట్టే జేజేఎం పైప్‌లైన్ నిర్మాణ పనులను స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఇప్పటికే రూ.2.60కోట్ల వ్యయంతో జేజేఎం పనులు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా చెంగలవీధి నుంచి పైప్‌లైన్ నిర్మాణ పనులు ప్రారంభమవుతాయన్నారు. పట్టణంలో శాశ్వతంగా తాగునీటి ఎద్దడిని పరిష్కరించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ నరసింహులు, సర్పంచ్ లలితమ్మ, ఉపసర్పంచ్ వన్నప్ప, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గోవిందు, పట్టణ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వకర్త ఓబన్న, జేసీఎస్ కన్వీనర్ ఆసీఫ్, నాయకులు వేమన్న, పచ్చి రవి, కురుబ ప్రకాష్, బ్యాళ్ల ప్రసాద్, సింగాడి ధనరాజ్, అంగదాల ఆంజి, వడ్డే ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ద్వి చక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం: శెట్టూరు మండలం అడవిగొల్లపల్లి వద్ద ఆదివారం రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొని ఇద్దరు గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు...అడవిగొల్లపల్లికి చెందిన వడ్డే గంగాధర్ ద్విచక్రవాహనంలో పాల వెంకటాపురం నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. అలాగే కళ్యాణదుర్గం పట్టణంలోని మారెంపల్లి కాలనీకి చెందిన బోయ వన్నూరుస్వామి శెట్టూరు వైపు నుంచి వస్తున్నాడు. అడవి గొల్లపల్లి వద్దకు రాగానే ఎదురెదురుగా రెండు ద్విచక్రవాహనాలు ఢీ కొన్నాయి. ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు వారిని 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వడ్డే గంగాధర్‌కు తీవ్ర గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మోస్తరు వర్షం

బొమ్మనహాళ్: మండలంలో శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన ఓ మోస్తరు వర్షం కురిసింది. కొలగానహళ్లి, ఉద్దేహాళ్, బండూరు తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో వర్షం కురవడంతో మొక్కజొన్న, వరి పంటలు నేలవాలాయి. చేతికి వస్తున్న సమయంలో పంటలు నేలవాలడంతో తీవ్ర నష్టం వాటిల్లుతుందని రైతులు తీవ్ర ఆందోళన చెందారు. మిరప పంటలో నీరు నిలబడ్డాయి.